ప్రజాశక్తి

సోమవారం 30 జూన్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

రెచ్చిపోతున్న దొంగల ముఠాలు

- రైళ్ల సిగ్నల్ ట్యాంపరింగ్‌తో పొంచి ఉన్న ప్రమాదాలు
- పిడుగురాళ్ల పరిసరాల్లో దోపిడీలకు పన్నాగం
- పోలీసు కాల్పులతో దుండగుల పరారీ
- శనివారం స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లో బంగారు ఆభరణాల చోరీ
- పల్నాడు జిల్లాలో భయం గుప్పిట్లో రైల్వే ప్రయాణికులు





ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు ప్రాంతంలో రైళ్లల్లో దొంగతనాలు, దోపిడీలు ప్రయాణికులను భయపెడుతున్నాయి. సిగ్నల్ వ్యవస్థను ట్యాంపర్ చేసి రైలును నిలిపివేసి దొంగలు దోపిడీకి పాల్పడుతున్నారు. శనివారం తెల్లవారుజామున న్యూ పిడుగురాళ్ల స్టేషన్‌కు సమీపంలో సిగ్నల్ వ్యవస్థను దుండగులు ట్యాంపరింగ్ చేశారు. దీంతో విశాఖపట్నం నుంచి చర్లపల్లికి వెళ్తున్న స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచిపోయింది. వెంటనే దుండగులు రైల్లోకి ప్రవేశించి ఇద్దరు మహిళల మెడల్లోని బంగారు ఆభరాలను దోపిడీ చేశారు. ఒక మహిళ వద్ద 20 గ్రాములు, మరో మహిళ వద్ద 30 గ్రాముల బంగారు గొలుసులను లాక్కొని పారిపోయారు. ఈ సంఘటనతో రైల్వే పోలీసులు అప్రమత్తమయ్యారు. శనివారం అర్ధరాత్రి గుంటూరు-దాచేపల్లి సెక్షన్‌లో నిఘా ఏర్పాటు చేశారు. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు వద్ద భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న విశాఖ ఎక్స్‌ప్రెస్‌పై ఏడుగురు దాడి చేశారు. దోపిడీకి ప్రయత్నించారు. అప్రమత్తమైన రైల్వే పోలీసులు కాల్పులు జరపడంతో దుండగులు తప్పించుకుని పారిపోయారు. దుండగులు ఎస్4, ఎస్7 భోగిలలో అలారమ్ చైను లాగి ప్రయాణీకులు వద్ద బంగారం, డబ్బు దోచుకునేందుకు ప్రయత్నించగా రైల్వే ఎస్ఐ వెంకట్రాది, ఇద్దరు పోలీసులు 9 రౌండ్లు కాల్పులు జరిపారు. గతేడాది ఇదే ప్రాంతంలో పలు రైళ్లలో దోపిడీలు జరిగాయి. ప్రధానంగా బీహార్, ఉత్తర ప్రదేశ్, మహరాష్ట్ర ప్రాంతానికి చెందిన దొంగలు కోస్తా ప్రాంతంలో రైళ్లలో దోపిడీలకు యత్నిస్తున్నట్టు పోలీసు అధికారులు అనుమానిస్తున్నారు. ప్రయాణికులంతా నిద్రలో ఉండగా దుండగులు ప్రవేశించి కత్తులు చూపి దోపిడీలకు పాల్పడుతున్నారు.

గతాన్నికంటే భిన్నంగా ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో సిగ్నల్ వ్యవస్థను ట్యాంపరింగ్ చేయడం ద్వారా ఎక్కడ ఏ రైలు ఆపాలో వారు నిర్ధేశిస్తున్నారు. గతంలో రైలు క్రాసింగ్ నిమిత్తం ఆగినప్పుడు, తోటి ప్రయాణికుల్లాగా ప్రయాణిస్తూ దొంగతనాలు చేసి పారిపోయే వారని పోలీసులు తెలిపారు. కానీ ఇటీవల కాలంలో రైళ్లను సిగ్నళ్లు ఉన్నచోట ఆపేలా చేసి మరీ దొంగతనాలకు పాల్పడుతున్నారని అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు ఒంగోలు, రేణిగుంట, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో ఈ తరహా దొంగతనాలు ఎక్కువగా జరిగాయి. వీటిపై దర్యాప్తు చేస్తున్న బృందాలు ఇంకా నిందితులను పట్టుకోలేకపోయారు. దీంతో ఈ ఘటనలు కొనసాగుతున్నాయి. తాజాగా పల్నాడు ప్రాంతంలో రెండు రోజుల వ్యవధిలో రెండు ఘటనలు జరిగాయి. సిగ్నల్ ట్యాంపరింగ్ ద్వారా రైలు ఆపితే సిగ్నల్ వ్యవస్థ దెబ్బతిని అనేక ప్రమాదాలు జరిగే అవకాశంఉంది. దుండగులు సిగ్నల్ ఆధారంగా రైళ్లు అపితే లోకోపైలెట్ అప్పటికప్పుడు రైలు ఆపేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో వెనుక వచ్చే రైళ్లుకూడా పరిశీలించాల్సి ఉంది. ఏమాత్రం తేడా వచ్చినా పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రైల్వే అధికారులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నరసరావుపేటలో 'ఊరి బడిలో పిల్లల్ని చేరుద్దాం' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎన్.వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్ని పరిరక్షించుకుందాం

- తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంచి పిల్లల్ని చేర్పించేందుకు ప్రత్యేక కృషి
- ఉపాధ్యాయులకు యుటిఎఫ్ పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

బడిఈడు పిల్లలందర్నీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యత ప్రభుత్వ ఉపాధ్యాయులు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గుంటూరు, పల్నాడు జిల్లాలా కార్యవర్గ సమావేశాల్లో ఆదివారం పాల్గొన్న ఆయన ప్రభుత్వ విద్య పరిరక్షణ, ఉపాధ్యాయ హక్కులపై మాట్లాడారు. ఆదివారం గుంటూరు బ్రాడీపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో

▶ 2లో



తాడేపల్లిలోని పాత సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద గుంటూరుకు తాగునీరు అందించే గుంటూరు ఛానల్ పరిస్థితి



తూటుకాడ, గుర్రపుడెక్కతో పూడుకుపోయిన ఉండవల్లి గుహల వద్ద కొండవీటివాగు

కాల్వలు ఇలా.. సాగునీరు అందేది ఎలా..?

మురికి కూపంలా బకింగ్‌హామ్ కాల్వ - చివరి భూములకు నీరుపై రైతుల్లో ఆందోళన



తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్ వద్ద వ్యర్థాలతో బకింగ్‌హామ్ కాల్వ

ప్రజాశక్తి - తాడేపల్లి

ఖరీఫ్ సాగులో రైతులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే నారుమళ్లు సిద్ధం చేసే పనిలో పడ్డారు. అయితే సుమారు 5.60 లక్షల ఎకరాలకు సాగునీరందించే కృష్ణా పశ్చిమ డెల్టా బకింగ్ హామ్ కాల్వ తూటికాడ, గుర్రపుడెక్క, చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో మురికి కూపాన్ని తలపిస్తోంది. దీనికితోడు సమీపంలోని దుకాణాల్లోని టీ గ్లాసులు, ఇతర చెత్తంతా కాల్వలో పడేస్తున్నారు. ఈ వ్యర్థాలన్నీ కలిసి నీటిపారుదలకు అడ్డంకిగా మారాయి. మరోవైపు కాల్వలో కుళ్లిన వ్యర్థాలు, మురుగు వల్ల దుర్వాసనతో తాను యాతన పడుతున్నామని, దోమలు, ఈగల ఉధృతితో రోగాల పాలవుతున్నామని కాల్వ సమీప ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. పలుచోట్ల పంట కాల్వలను మరమ్మతులు చేస్తున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా తాడేపల్లిలో మాత్రం ఆ చర్యలేమీ కనిపించడం లేదు. ఇప్పటికే ఏళ్లతరబడి పూడిక తీయక కాల్వలు కుచించుకుపోయాయి. సీడ్ కాపిటల్‌లోని అన్ని గ్రామాల్లో పొలాలకు నీరందించే కొండవీటి వాగు సైతం తూటికాడ, గుర్రపు డెక్క, గడ్డితో నిండిపోయింది. ఫలితంగా అధిక వర్షాల సందర్భంలో వాగు పొంగి సుమారు 10 వేల ఎకరాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. పాలకులు ఇప్పటికైనా స్పందించి కాల్వలను శుభ్రం చేయించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లను పెట్టడానికి వస్తే వ్యతిరేకించండి

ప్రజలకు సిపిఎం పిలుపు



విలేకర్లతో మాట్లాడుతున్న నేతాజి

ప్రజాశక్తి- తాడేపల్లి

గంటకో ధర వసూలు చేయడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఎవరైనా వస్తే వ్యతిరేకించాలని ప్రజలకు సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. తాడేపల్లికి ఆదివారం వచ్చిన ఆయన స్థానిక ప్రకాష్ నగర్‌లోని సిపిఎం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు పూనుకోగా వాటిని పగలగొట్టాలని నారా లోకేష్ పిలుపునిచ్చారని, ఇప్పుడు వారి ప్రభుత్వమే ఎందుకు బిగిస్తోందని నిలదీశారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే గంటల ప్రాతిపదికన విద్యుత్ ఛార్జీలు టారిఫ్ మారుతుందని, ప్రజలపై ఛార్జీల భారం పడుతుందని తెలిపారు. అయినా ఇందుకు ప్రభుత్వం దూకుడుగా సిద్ధమవడాన్ని విమర్శించారు. స్మార్ట్ మీటర్లబిగింపుకు వ్యతిరేకంగా సిపిఎం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, లేనప్పుడు మరో విధంగా మాట్లాడే రాజకీయ పార్టీలను నిలదీయాలన్నారు. సమావేశంలో సిపిఎం రూరల్ కార్యదర్శి పి.కృష్ణ, నాయకులు వి.దుర్గారావు పాల్గొన్నారు.

ఖాళీ స్థల యజమానులు పన్ను వేయించుకోండి

ప్రజాశక్తి - తాడేపల్లి

మంగళగిరి - తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఖాళీ స్థల యజమానులు తమ తమ స్థలాలకు పన్నులు వేయించుకోవాలని ఎమ్‌టిఎంసి కమిషనర్ ఎస్‌కె ఆలీమ్‌బాష సూచించారు. ఇందుకు సచివాలయాల్లో సోమవారం సంప్రదించాలని, ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ప్యారీ కంపెనీ గేటు వద్ద అండర్ పాస్‌ను నిర్మించాలి

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి ప్యారి కంపెనీ గేటు వద్ద ఎడ్ల బండ్లు, ఆటోలు, కార్లు, టూ వీలర్స్ రాకపోకలు సాగించే విధంగా అండర్ పాస్ నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వాన్ని సిపిఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కె.కాశయ్య డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి సిపిఐ కార్యాలయంలో సెంట్రల్ శాఖ మహాసభను టి.వెంకటయ్య అధ్యక్షతన జరిగింది. కాశయ్య మాట్లాడుతూ తాడేపల్లి పశువుల ఆస్పత్రి వద్ద ఉన్న బకింగ్ హోమ్ కెనాల్ శిధిలావస్థకు చేరుకుందని, నూతన బ్రిడ్జి నిర్మించాలని కోరారు. రైల్వే స్థలాల్లో ఇళ్లేసుకుని ఉంటున్న వారికి పట్టాలివ్వాలని కోరారు. వచ్చేనెల 20న సిపిఐ తాడేపల్లి ప్రాంత మహాసభ తాడేపల్లి సిపిఐ కార్యాలయంలో, 27న నియోజకవర్గం మహాసభ మంగళగిరిలో జరుగుతుందన్నారు. ఆగస్టు 5,6,7, తేదీలలో గుంటూరులో జిల్లా మహాసభ, ఆగస్టు 23, 24, 25 తేదీలలో ఒంగోలులో రాష్ట్ర మహాసభ, అక్టోబర్‌లో చండీగఢ్లో జాతీయ మహాసభ జరుగుతుందని వివరించారు. అనంతరం తాడేపల్లి సెంట్రల్ శాఖ కార్యదర్శిగా మునగాల రామారావును ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

కారుణ్య నియామకాలు చేపట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు : అన్ని ప్రభుత్వ శాఖల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ తీర్మానించింది. గుంటూరులో ఆదివారం జరిగిన టిఎన్‌యుఎస్ కార్యవర్గం సమావేశంలో టిడిపి గుంటూరు తూర్పు, పశ్చిమ ఇన్‌చార్జి తాళ్ల వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ 62వేల మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. గత 15 ఏళ్లుగా ఉపాధ్యాయుల సమస్యల పట్ల టిఎన్‌యుఎస్ చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. మన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ 117 జిఒ రద్దుచేసి మోడల్ స్కూల్ ఏర్పాటు చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు చెప్పారు. సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షులు సిహెచ్.పూర్ణచంద్రరావు, ఎం.రాంబాబు, రాష్ట్ర మహిళా కార్యదర్శి సిహెచ్.పద్మావతి, ఏలూరు జిల్లా అధ్యక్షులు ఎన్.శర్వాణి, కార్యదర్శులు కె.వెంకట్రావు, ఎన్.వి.జగదీష్ కుమార్, టి.రామారావు, జె.ఆంజనేయులు, గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.బాలస్వామి, కార్యదర్శి పి.జగదీష్‌బాబు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో కృష్ణాజిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ (10) చైల్డ్ , అండర్ (12) మిని విభాగంలో ఫెన్సింగ్ ఛాంపియన్షిప్‌నకు 10 జిల్లాల నుండి 200 మంది క్రీడాకారులు ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లు పోటీలలో పాల్గొననున్నారు.ఈ పోటీలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, టిడిపి యువ నాయకులు, ప్రముఖ న్యాయవాది బొండా రవితేజ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫెన్సింగ్ అనేది ఒక ఒలింపిక్ క్రీడ "ఆధునిక ఖడ్గయుద్ధం" క్రీడలో, ఇద్దరు ప్రత్యర్థులు (ఫెన్సర్లు) ఒకరినొకరు కత్తితో తాకడానికి ప్రయత్నిస్తారు, అదే సమయంలో తమను తాము దాడుల నుండి రక్షించుకుంటారు అని, ఇది చాలా వేగవంతమైన, వ్యూహాత్మక క్రీడ అని అన్నారు. దేశంలో ఫెన్సింగ్ క్రీడ క్రమంగా ప్రాచుర్యం పొందుతోందని చెప్పారు. 2025 ప్రపంచ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లు జూలై 22 నుండి 30 వరకు జరుగనున్నాయని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్ని పరిరక్షించుకుందాం

నిర్వహించిన సమావేశానికి జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ అధ్యక్షత వహించగా, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో నిర్వహించిన సమావేశానికి జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఆయా సమావేశాల్లో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో నైతిక విలువలు, రాజ్యాంగ విలువలు కాపాడుకోవాలంటే ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కావాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కావడానికి ఆ రంగంలో పనిచేసే ఉపాధ్యాయులే ప్రత్యేకమైన కృషి చేయాలని చెప్పారు. అన్ని రకాల సదుపాయాలున్న, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులున్న ప్రభుత్వబడి అభివృద్ధి చెందాలని, తద్వారా సమాజంలో బాధ్యత గల పౌరులు తయారవుతారని అన్నారు. ప్రభుత్వ బడిపట్ల సమాజానికి, తల్లిదండ్రులకి నమ్మకం కల్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు అందరూ జూలై మొదటి వారంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కోసం ప్రత్యేక క్యాంపెయిన్ చేయాలని పిలుపునిచ్చారు. 2 నెలల క్రితం జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో 67 వేల మంది వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లారని, 4 వేల మంది ప్రమోషన్లు పొందారని చెప్పారు. ఇప్పటికీ కొన్ని సమస్యల వెంటాడుతున్నాయని, జీతాలు సకాలంలో రావడం లేదని, రిలీవ్‌లు ఇవ్వడం లేదని తెలిపారు. గుంటూరు సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షులు ఎఎన్ కుసుమకుమారి మాట్లాడుతూ బదిలీల చట్టం ద్వారా జరిగిన బదిలీలు, ప్రమోషన్లలో ఉన్న అసంబద్ధాలను సరిజేయడానికి యుటిఎఫ్ అన్ని సంఘాల్ని కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటం చేసిందని, తద్వారా మెజారిటీ ఉపాధ్యాయులకు న్యాయం జరిగిందని తెలిపారు. బదిలీలు ప్రమోషన్లలో క్యాడర్ స్ట్రెంత్, పొజిషన్ ఐడిలు, డిడిఓ కోడ్స్ త్వరితగతిన పూర్తి చేసి ఉపాధ్యాయుల సమస్యలు, జీతాల సమస్య పరిష్కారం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ 12వ పిఆర్సీ చైర్మన్‌ను తక్షణం నియమించి, పెండింగ్‌లో ఉన్న డిఏలను, ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ విద్యారంగ వికాసం కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం పనిచేసే సంఘం యుటిఎఫ్ అని తెలిపారు. బదిలీలు, ప్రమోషన్ల సందర్భంగా ఉపాధ్యాయులకు ఎదురైన ప్రతి సమస్యను చిత్తశుద్ధితో కృషిచేసి పరిష్కరించామని, భవిష్యత్తులో ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, ప్రభుత్వ పాఠశాల బలోపేతం కోసం కృషిని కొనసాగిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా 'ఊరి బడిలో పిల్లల్ని చేరుద్దాం' అనే పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో గుంటూరు జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, వై.నాగమణి, కోశాధికారి గయాసుద్దౌలా, జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందు, ఎమ్‌డి.షకీలాబేగం, టి.ఆంజనేయులు, ఎ.శ్రీనివాసరావు, బి.ప్రసాద్, కె.కేదార్నాథ్, కె.కామాక్షి, ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. పల్నాడు జిల్లా సమావేశంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు, జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ ఖాసింపీరా, సహాధ్యక్షులు జెవిడి నాయక్, ఎ.భాగేశ్వరిదేవి, కోశాధికారి ఎం.రవిబాబు, రాష్ట్ర కౌన్సిలలర్లు ఎన్.సుందరరావు, డివి లింగయ్య పాల్గొన్నారు.



గుంటూరు సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

నీటి కాసులు అత్యంత ప్రమాదకరం

ప్రజాశక్తి - తెనాలి

నీటికాసులు అత్యంత ప్రమాదకరమని, వ్యాధి సోకిన వారిలో 8 నుంచి 10 శాతం మంది కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ మౌళీకృష్ణ తాళ్లూరి చెప్పారు. పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం స్థానిక నందులపేట కవిరాజా పార్క్ విజికె భవన్లో అసోసియేషన్ అధ్యక్షులు మొవ్వ సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగింది. డాక్టర్ మౌళికృష్ణ మాట్లాడుతూ కంటి సమస్యలు, వాటికి సంబంధించిన నివారణ చర్యలపై వివరించారు. 50 ఏళ్లు పైబడిన వారికి కంటి శుక్లాల సమస్య వస్తుందన్నారు. దీనికి చికిత్స లేదని ఆపరేషన్ అనివార్యమని చెప్పారు. కంటి సమస్యలలో నీటి కాసులు ప్రమాదకరమని, ఈ వ్యాధి సోకిన వారిలో 8 నుంచి 10 శాతం కంటి చూపును కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. వైద్యులను సంప్రదించి సకాలంలో చికిత్స పొందితే మేలు జరుగుతుందన్నారు. కంటి కలక, తదితర వ్యాధులు నివారణోపాయాలను చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌళీకృష్ణను అసోసియేషన్ బృందం సత్కరించింది. కార్యక్రమంలో కె.జ్ఞానేంద్ర ప్రసాద్, కె.ఈశ్వర్‌చంద్, ఎ.రామారావు, కె.వెంకట కోటయ్య, పి.కోటిరెడ్డి, ఎన్.ఆదినారాయణ, పి.పూర్ణచంద్రరావు, కె.చలమయ్య, సిహెచ్.శివరామయ్య పాల్గొన్నారు.



డాక్టర్ మౌళీకృష్ణను సత్కరిస్తున్న అసోసియేషన్ బృందం

వృద్ధాప్యంలో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

వృద్ధాప్యంలో శారీరకంగా, మానసికంగా వచ్చే వివిధ మార్పులపట్ల ఆందోళన చెందకుండా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ అప్రమత్తంగా ఉండాలని రమేష్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రావెళ్ల శ్రీగీత అన్నారు. అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో కె.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ శ్రీగీత మాట్లాడారు. 40 ఏళ్లు దాటిన దగ్గర నుండి శరీరం వృద్ధాప్య బాటపడుతుందని, అప్పటి నుండి ఆరోగ్యం గురించి కాస్త జాగ్రత్త పడితే వృద్ధాప్యం చాయలు త్వరగా దరిచేరకుండా జాగ్రత్త పడవచ్చని చెప్పారు. 60 నుండి 70 ఏళ్ల దాటిన వారిలో దగ్గు, నడుంనొప్పి, కీళ్ళ నొప్పులు ఎక్కువసార్లు మూత్రం అవటం, అలసట వంటివి సాధారణ లక్షణాలని చెప్పారు. కావున 60 ఏళ్లు దాటిన తర్వాత క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు అవసరమన్నారు. పౌష్టికాహారం, శారీరక వ్యాయామం, తగిన విటమిన్లు, ఖనిజ లవణాలు తీసుకోవటం, మానసిక ఒత్తిడిని అధిగమించటం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండం అవసరమని చెప్పారు. వినికిడి లోపం, మతిమరుపు, డిప్రెషన్, దంత సమస్యలు, మలబద్ధకం, బరువు తగ్గిపోవటం లాంటివి వృద్ధాప్యంలో సహజంగా వస్తుంటాయని, వీటికి డాక్టర్లను సంప్రదించి వైద్య సలహాలు, చికిత్స పొందాలని సూచించారు. రక్తపోటు ఉన్న వారిలో తలనొప్పి, తల తిరగటం, అలసట, గుండెల్లో దడ ఉంటాయన్నారు. వృద్ధాప్యంలో వ్యాయామం, నడక, యోగా వంటివి అవసరమన్నారు. వ్యాయామం వల్ల రక్తప్రసరణ, శ్వాశకోశాల పనితీరు మెరుగుపడుతుందని, మానసిక ఒత్తిడి తగ్గుతుందని వివరించారు. అనంతరం డాక్టర్ శ్రీగీతను అవగాహన సంస్థ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రకుమార్, డాక్టర్ ఆర్.రామచంద్రరావు, ఎ.వి.రామారావు, కె.శివరామిరెడ్డి పాల్గొన్నారు.



ఆరోగ్య సభలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీగీత

అడ్డగోలుగా ఔషధ వ్యాపారాలు

- ప్రిస్కిప్షన్ లేకుండానే శాంపిల్లు, ఇతర మందుల విక్రయాలు
- లైసెన్స్ ఒకరిది - నిర్వహణ మరొకరిది
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు
- నిబంధనలు మీరుతూ.. ప్రాణాలకుమీదకు తెస్తూ..



మృతి చెందిన బొంత షాలిని (పాతచిత్రం)

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మెడికల్ షాపు చిన్నదైనా పెద్దవైనా అందులో ఫార్మాసిస్ట్ ఉండాలి. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందులు ఇవ్వాలి. మందులు ఎలా వేసుకోవాలో రోగికి వివరించాలి. ఇవి వెండికల్ షాపు నిర్వాహకుల ప్రాథమిక నిబంధనలు. కానీ మండల, నియోజకవర్గ స్థాయిలో మెడికల్ షాపుల్లో మందుల వ్యాపారం కిరాణ షాపుల్లా మారింది. డాక్టర్ రాసిచ్చే వాటితో సం బంధం లేకుండా ఎవరేమి అడిగినా ఆయా మందులు ఇచ్చేస్తున్నారు. డి ఫార్మసి లేదా ఎం-ఫార్మసీ సర్టిఫికెట్ ఉంటే చాలు మెడికల్ షాపు పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం అడుతున్నారు. ఇంత జరుగుతున్నా డ్రగ్ కంట్రోల్ అధికారులు పట్టించు కోకపోవడంలేదనే విమర్శలు విని పిస్తున్నాయి...అనారోగ్యం గురించి చెబితే చాలు మెడికల్ షాపుల్లో అన్ని రకాల మందులు ఎంత మొత్తంలో కావాలన్నా ఇస్తారు. డాక్టర్ ప్రిస్కిప్షన్ అవసరమే లేదు. ఏ మందులు వేసుకోవాలో.. రోజుకు ఎన్ని వేసుకోవాలో ఎన్ని రోజులు వాడాలో కూడా వారి చెప్పిస్తారు. కార్డియాలజీ, సైక్రియాట్రిక్, న్యూరాలజీ, యూరాలజీ, బ్రెయిన్ స్ట్రోక్, డయాబెటిక్, బీపీ, థైరాయిడ్, యూరిన్ ఇన్ఫెక్షన్ తదితర సమస్యలకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వకూడదు. ఈ వ్యాధుల ఔషదాల డోజ్ తేడాలు, రకాలఉంటాయి. వ్యాధి తీవ్రత, రోగి వయసు, శరీర తత్వాన్ని బట్టి మందులు నిర్ణయిస్తారు. కానీ, మెడికల్ షాపుల నిర్వాహకులు ఈ సమస్యలకు సైతం మందులు ఇవ్వడం గమనార్హం. ఈ క్రమంలో అప్పుడప్పుడు తనిఖీలు చేయడం. నామ మాత్రంగా కేసులు నమోదుచేసి వదిలేయటం పరిపాటిగా మారింది.... నకిలీ మందల జోరు....డ్రగ్స్, కాల పరిమితి దాటిన, నకిలీ మందుల విక్రయాలుసైతం జోరుగా కొనసాగుతున్నాయి డాక్టర్ రాసిన కలపెనీల ఔషధాలు లేకుంటే, వాటికి బదుల వేరే కంపెనీ మందులు అంటగడుతున్నారు. సేమ్ ఫార్ములా.. కంపెనీ మాత్రమే వేరు..ఇది కూడా దానిలాగే పని చేస్తుందని చెబుతున్నారు. మండలంలో సుమారు 250 పైగా రిటైల్, హోల్‌సేల్‌గా (హోల్ సెల్ గా25,30 రిటైల్ గా 220 షాపులు) షాపులు, రిటైల్‌గా మెడికల్ షాపలున్నాయి. రోజుకు లక్షల్లో వ్యాపారం జరుగుతుంది. జిల్లాలో విధులు నిర్వహించే డ్రగ్ ఇన్ఫెక్టర్ ఎక్కడ ఉంటారో... ఏ ప్రాంతంలో తనిఖీలు చేస్తున్నారో ఎవరికీ తెలియదు...నిబంధనలకు పాతర....డ్రగ్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ ప్రకారం ప్రతీ మెడికల్ షాపులో రిజిస్టర్డ్ ఫా ర్మసిస్టు ఉండాలి. బి- ఫార్మసీ, ఎం-పార్మసీ చేసిన వారు మా త్రమే మెడికల్ షాపు నిర్వహించాలి. మెడికల్ షాపులకు అనుమతిచ్చే సమయంలో ఔషధ నియంత్రణ శాఖా ధికారులు పార్మాసిస్టు ఉన్నది లేనిది తనిఖీ చేయాలి. ఏరియా డ్రగ్ ఆనెస్పెల్లకు ఈ బాధ్యత నిర్వర్తించాలి. కానీ కొందరు ఇన్‌స్పెక్టర్లు మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి... కమీషన్ మాయాజాలం.మందుల విక్రయం పెద్ద వ్యాపారంగా మారింది. తమ కంపెనీకి చెందిన రూ. కోటి విలువ చేసే మందులు అమ్మితే అందులో 40 శాతం కమీషన్ ఇస్తామని నిర్వాహకులు వైద్యులతో ఒప్పందాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో వైద్యుల కంపెనీ మందు లు సేల్ చేసేందుకు అవసరం ఉన్నా లేకున్నా రోగుల నెత్తిన రుద్దుతున్నారు. ప్రొటీన్ పౌడర్ బ్రాండెడ్ రూ.150 లభిస్తుండగా జనరిక్ లో రూ 25 లకు అభిస్తుంది. ఎన్ జైమ్మ్ సిరప్ రూ. 60 లభిస్తే జనరిక్‌లో రూ. 25 లభిస్తోంది. బ్యాబ్లెట్ ఎసినిక్ ప్లస్ బ్రాండెడ్లో రూ.50లకు లభిస్తుండగా, జనరిక్ షాపుల్లో రూ 10లకు లభిస్తుంది. అయితే మండల కేంద్రా లు, గ్రామీణ ప్రాంతాల్లో జనరిక్ ముకులు షాపులు ఏర్పాటు చేయని కారణంగా రోగులు, పేదలు తీవ్రంగా నష్టపోతున్నారు... లైసెన్స్ ఒకరిది-నిర్వహణ మరొకరిది... ప్రొఫెషనల్ ఫార్మసీస్టు ఆధ్వర్యంలో అవగాహన ఉన్న సిబ్బందిలో మాత్రమే దుకాణాల నిర్వహించాలి. కానీ మండలంలో అనేక మందుల షాపులు బినామీ వ్యక్తులు నిర్వహిస్తున్నారు. మెడికల్ పరిజ్ఞానం లేని వ్యక్తులు షాపులను నడుపుతూ ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు, ఎడీలు మెడికల్ షాపులుని ర్వా హకులతో ఒప్పందాలు చేసుకొని నిబంధనలకు పాత రేస్తున్నారనే విమర్శలున్నాయి. డ్రగ్ ఇన్స్పెక్టర్లతో సైతం ఒప్పందాలు చేసుకుని షాపులు నిర్వహిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇటీవల జరిగిన దారుణ ఘటన...యడ్లపాడు మండల పరిధిలో జగ్గాపురం గ్రామానికి చెందిన బొంత షాలిని అనే 4వ తరగతి చదువుతున్న పాప చనిపోవటం నియోజకవర్గ స్థాయిలో సంచలనం సృష్టించింది. ప్రయివేట్ మెడికల్ షాపులో మందులు వాడి అవి వికటించి చనిపోతే మెడికల్ సంబంధించిన ఏ అధికారి అందు బాటులో లేరు. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరుకుంటున్నారు.

నేడు గుంటూరు కౌన్సిల్ భేటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం 10:30 గంటలకు జరగనుంది. మేయర్ కోవెలమూడి రవీంద్ర సమావేశం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు సమావేశానికి హాజరు కానున్నారు. గతనెల 7వ తేదీన జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలతో పాటు పలు కొత్త అంశాలతో ఏజెండా రూపొందించారు. పలువురు కార్పొరేటర్లు ఇచ్చిన 37 రాతపూర్వక ప్రశ్నలతో పాటు మరో 21 అంశాలపై ఆమోదం కోసం ప్రియాంబుల్స్‌తో ఎజెండా రూపొందించారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం వరకు సమావేశం జరగనుంది. గతంలో మూడు నెలలు దాటినా సమావేశం నిర్వహించే వారు కాదు. కూటమి పాలన వచ్చిన తరువాత 50 రోజులుకే సమావేశం ఏర్పాటు చేశారని పలువురు టిడిపి కార్పొరేటర్లు హర్షం వ్యక్తం చేశారు.

సబ్ జూనియర్స్ అండర్-15 చదరంగం విజేతలు వీరే..

ప్రజాశక్తి - విజయవాడ

నగరంలోని ఫన్ టైమ్స్ నందు ఆదివార అండర్ 15 సబ్ జూనియర్స్ చదరంగం పోటీలు నువ్వా నేనా అనేలా రసవత్తరంగా ఈ పోటీలు సాగాయి. ఈ పోటీలకు ఫన్ టైమ్స్ కార్యవర్గ సభ్యులు బుర్ర రాధాకృష్ణ వైస్ ప్రెసిడెంట్, కొసరాజు విజయబాబు ఆర్గనైజర్ సెక్రెటరీ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ చదరంగం ప్రతిరోజు సాధన చేసే వారికి జీవితంలో అనేక విజయాలతో ముందుకు సాగుతారని అన్నారు. ఈ ఆట వలన పిల్లలకు జ్ఞాపకశక్తి అన్ని విషయాలను చురుగ్గా ఉంటారని తెలిపారు విజేతలు : బాలురు విభాగంలో తాళ్ల నిశ్చల్ 6/7 పాయింట్లతో ప్రథమ, ఎన్ ప్రీతం దర్శన్ 6/7 పాయింట్లతో ద్వితీయ, అనగానే శశాంక్ 6/7 తతీయ, మందుల బాబు శామ్యూల్ 6/7 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో జే నందిక 5/5 ప్రథమ, పి గీతిక 4/5 ద్వితీయ, శ్రీమహి 4/5పాయింట్లతో తతీయ, కె సాయి వీక్షణ 4/5 నాలుగవ స్థానంలో నిలిచారు. ఈ గెలుపొందిన క్రీడాకారులు జులై 12వ తేదీన విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు మన ఎన్టీఆర్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండి అక్బర్ పాషా మరియు మందుల రాజీవ్ తెలిపారు.

మళ్లీ నష్టపోయిన బెండ రైతులు



ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రత్యామ్నాయం లేకనే నష్టపోతుండామని బెండ సాగు చేస్తున్నామని మండలంలోని మస్కలపూడి గ్రామానికి చెందిన చిన్నాచితక కౌలు రైతులు వాపోతున్నారు. చిన్నప్పటి నుంచి పొలం పనులకే అంకితమయ్యాము. వేరే పనులు చేయలేము. అందుకే కష్టం వచ్చినా భూమినే నమ్ముకున్నాం. దాదాపు 15 మంది కౌలు రైతులు గుంటూరులోని కోస్టల్ హైబ్రిడ్ సీడ్స్ డిపో నుండి అంబికా బ్రాండ్ విత్తనాలు తీసుకొచ్చి నాటారు. కిలో రూ.5వేలకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఒక్కో ఎకరానికి మూడు కిలోలు అవసరమవుతాయి. కౌలు ఎకరాకు రూ. 40వేలు, విత్తనం నాటినందుకు రూ.35వేలు, దుక్కులు, పురుగు మందులు అదనం. కంపెనీ వారు స్పందించడం లేదు రైతులందరికీ కలిసి విత్తనాలు అమ్మిన షాపు వారిపై కేసు పెట్టి కోర్టులో దావా వేద్దామనుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలి

రైతులకు నష్టపరిహారం అందించాలి. ముందు అధికారులకు తెలియజేస్తామని మండల రైతు యార్లగడ్డ బ్రహ్మేశ్వర రావు తెలిపారు. నష్టపరిహారం అందించలేని పక్షంలో రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు.

నాసిరకం విత్తనాలతో నష్టపోయాం



అప్పు చేసి పంట సాగు చేశారు. దిగుబడి బాగుంటే కుటుంబం ఆర్థికంగా నిలదొక్కు కుంటుందని ఆశపడ్డాను. అయితే నాణ్యతలేని విత్తనాలు అంటగట్ట డంతో పంట ఏపుగా పెరిగినా కాపు లేదు. దిగుబడి లేదు. పెట్టుబడి అంతా నష్టపోయాము. పడిన శ్రమ అంతా వృథా అయింది. షాపు యజమానిని నిలదీస్తే కంపెనీ ఏజెంట్ ఫోన్ నెంబర్ ఇచ్చాడనీ, ఫోన్ చేసి విషయం తెలిపినప్పటికీ కంపెనీ నుండి ఎటువంటి స్పందన రాలేదు. గతంలో అనేకసార్లు నకిలీ విత్తనాలతో నష్టపోయాం. ఏటికాయేడు పంట వస్తుందని ఆశతో సాగు చేస్తున్నా... ప్రతిసారీ నష్టపోతూనే ఉన్నా. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి. లేదంటే ఆర్థికంగా కోలుకోలేము.

- పెరవలి రవి, కౌలు రైతు

కౌలు తీసుకుని సాగు చేశా



కుటుంబ పోషణ కోసం భూమిని కౌలుకు తీసుకుని సాగు చేశాను. నాసిరకం విత్తనాలతో పంట దిగుబడి రాలేదు. పంటపై పెట్టిన పెట్టుబడి అంత నష్ట పోయాం. నకిలీ విత్తనాల గురించి కంపెనీ వారితో మాట్లాడితే ఎటువంటి స్పందన లేదు. సాగు కోసం అప్పు చేశా. ఇపుడు దిగుబడి లేక అప్పు తీర్చే మార్గం కనిపించడం లేలు. ఒక్కసారి వచ్చి చూస్తే పరిస్థితి అర్థం అవుతుందని కంపెనీ వానికి చరవాణి ద్వారా పలుమార్లు తెలిపినా ఎవరూ రావడం లేదు. కంపెనీ నుండి ఎటువంటి స్పందన లేదు. ప్రభుత్వమే తమకు న్యాయం చేయాలి. మాకు వేరే మార్గం లేదు.

- ఏమినేని రవీంద్ర కౌలు రైతు .

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No: 82/2024 in O.S. No:29/2024

గంగసాని అనిత ...పిటిషనర్ / వాది

వర్సెస్

మాలపాటి నాగేశ్వరమ్మ ...రెస్పాండెంట్ / ప్రతివాది

To,

మాలపాటి నాగేశ్వరమ్మ, భర్త గోవిందా చారి, వయసు 65సం, హిందూ, నివాసం: నడి గడ్డ గ్రామం, వినుకొండ మండలం, పల్నాడు జిల్లా.

దావాసమను

పై నెంబర్ పిటిషన్ లో శ్రీ కోర్టు వారు మీకు ఎన్ని మార్లు నోటీసులు పంపించినను జారీ కానందున తేదీ : 28-07-2025దిన మీ నోటీసు కొరకు వాయిదా ఉన్నది. కావున పై నెంబరు దావా యందు మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యడలతే: 28-07-2025 దిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేక లాయర్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తరువుల మేరకు)

తేది :30-6-2025

వాయిదా తేదీ:28-07-2025 **ఇట్లు**

ఎస్.ఎం బాషా,
వాది తరుపు అడ్వకేట్,
పొదిలి, ప్రకాశం జిల్లా.
సెల్ :9949435269.



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమారి

పరిమితులు లేని పని విధానం అమలుకు కుట్రలు

9న సార్వత్రిక సమ్మె జయప్రదం కోసం ఆశాల సన్నాహక సమావేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కార్మిక, కర్షక అణగారిన వర్గ ప్రజల సంక్షేమం కోసం 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఏపి ఆశా వర్కర్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివ కుమారి పిలుపునిచ్చారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో యూనియన్ నాయకులు ఎం.రత్నకుమారి అధ్యక్షతన సార్వత్రిక సమ్మె జయప్రదంకై జరిగిన సన్నాహక సమావేశం నిర్వహించారు. శివ కుమారి మాట్లాడుతూ కేంద్రంలో వరుసగా 3వసారి అధికారంలోకి వచ్చిన మోడీ కార్మిక చట్టాలను కాలరాస్తూ 44 కార్మిక చట్టాల ను లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల జీవితాలను పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టేకుట్రలు చేస్తున్నారన్నారు మోడీ విధానాలను తిప్పికొట్టాలనీ, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలనీ, ఆశాలను కార్మికులుగా గుర్తించాలని కనీస వేతనం, చట్టబద్ధమైన సౌక ర్యాలు కల్పించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక వర్గానికి వ్యతిరేక నిర్ణయాలకు, పరిమితులు లేని 14 నుండి 20 గంటల పని విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. పని గంటల పెంపు విధానం, రాత్రి సమయంలో మహిళలతో పని చేయించాలనే నిర్ణ యాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఏ రంగంలో పని చేసే కార్మికులకైనా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని అవహేళన చేస్తూ కేంద్రంలో అధికా రంలో ఉన్న మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ కార్మిక వర్గానికి తీరని ద్రోహం చేస్తున్నా రని మండిపడ్డారు. రాష్ట్రంలో 15 ఏళ్ల నుండి వేతనాలు పెరగలేదని పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేత నాలు పెరగక కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికులు పోరాటాలు చేసే హక్కు కోల్పోతా రని వారాంతపు సెలవులు, పిఎఫ్ ఈఎస్ఐలు, ఉండవని యూనియన్లు గుర్తింపు రద్దు చేస్తారని, కార్మిక వర్గానికి ఎటు వంటి భరోసా ఉండ దన్నారు. గత ప్రభుత్వంలో అంగీకరించిన డిమాండ్లకు వెంటనే జీవో విడుదల చేసి 20 ఏళ్ళుగా పేద ప్రజలకు ఆరో గ్య సేవలో అందిస్తున్న ఆశా వర్కర్స్‌కు కనీస వేతనాలు, చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయాలన్నారు. ఆశాల ఆందోళన ఫలితంగా వేతనంతో కూడిన సెలవులు, వయో పరిమితి పెంపు సమస్యల పరిష్కరిస్తామని అంగీకరిం చిన హామీలను త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎం.భూ లక్ష్మి, డి రత్నకుమారి, టి అంకమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

అడిగొప్పులకు తరలివచ్చిన సందర్శకులు

ప్రజాశక్తి -దుర్గి

మండలంలోని అడిగొప్పుల గ్రామంలో శ్రీ నిదానం పాటి లక్ష్మీ అమ్మవారి దేవాలయానికి సందర్శకులు ఆదివారం భారీగా తరలివచ్చారు. అనంతరం అమ్మవారిని పల్లకి సేవలో దేవాలయం చుట్టూ అమ్మవారిని ఊరేగిం పుగా తీసుకెళ్లారు. ఏర్పాట్లను దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదిశేష నాయుడు, ఆలయ శాశ్వత ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లలో వేగం పెంచండి

- జిల్లా సరిహద్దుల పేరుతో ఆంక్షలు విధించ రాదు
- తేమ శాతం వంకతో వెనక్కి పంపకుండా రైతులతో చర్చించే ఏర్పాటు చేయాలి
- ఆలస్యమైతే బరువు తగ్గి ఇంకా నష్టమొచ్చే అవకాశం
- డబ్బు 48 గంటల్లో ఖాతాలకు జమయ్యేట్లు ఏర్పాటు చేయాలి



ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఈ నల్లబార్లీ పొగాకును ఈనెల 20వ తేదీన లాంఛనంగా రైతుల వద్ద నుంచి కొనుగోలు ప్రారంభించి ఇప్పటి వరకూ కొనుగోలు చేస్తూనే ఉన్నారని నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహనారావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పొగాకు కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతోన్నాయన్నారు. రైతుల వద్ద పొగాకు చాలా వుందనీ, కొనుగోళ్లు త్వరిత గతిన పూర్తి కాకపోతే రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. నల్లబర్లీ పొగాకు రైతులకు అప్పులు, వడ్డీలేక్కువ అవ్వటమే కాకుండా పొగాకు కూడా చెడి పోవడమే కాకుండా బరువు తగ్గడంతో పాటు రంగుమారి రేటు తగ్గిపోయి అవకాశా లున్నా యన్నారు. ఎక్కువ మంది రైతులు పొగాకు బేళ్ళు తెచ్చు కోవటానికి అనుమతించాలన్నారు. క్రమ పద్ధతిలో ముందు రోజునే వాట్సాప్ మెసేజ్ ద్వారా రైతుకు ఎన్ని బిల్లు తెచ్చుకోవాలో తెలియ జేయాలన్నారు. ప్రభుత్వం రూ. 272 కోట్లను విడుదల చేసిందని ప్రభుత్వం, నాయకులు చెప్తున్నప్పటికీ పొగాకు కొన్న వెంటనే డబ్బు రైతుల ఖాతాకి జమ కావటం లేదనీ, సుమారు 10 రోజుల సమయం పడుతోందన్నారు. బయ్యర్ కొద్ది సమయంలోనే 300 బేళ్ళు కొనగలిగారన్నారు. రైతుల సౌకర్యా ర్ధం కోనుగోలు వేగం పెంచాలన్నారు. మాయిశ్చరైజింగ్ (తేమ)వుందని వెనక్కి పంపే కన్నా కొంచెంసేపు పొగాకు చెక్కులను విడదీసి గాలికి (ఆరపెట్టె సౌకర్యం కల్పించాలి) వదలి వేస్తే తేమ శాతం తగ్గుతుందన్నారు. రైతులతో ఇలాం టి విషయాలను చర్చించి నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. తేమ పరిమితులను సవరించాలనీ, కొనుగోలు కేంద్రాలు ప్రతి మండల కేంద్రా ల్లో ఏర్పాటు చేయాలని అన్నారు. పెదనందిపాడు, ఇంకొల్లు కొనుగోలు కేంద్రాలను పెట్టాలన్నారు. పర్చూరుకు పక్కనే వున్న గ్రామాల రైతులను గుంటూరుకు పొమ్మనకుండా కంప్యూటర్ సహాయంతో వివరాలను సేకరించి దగ్గరలో అమ్ముకునే అవకాశం కల్పించాలని తెలిపారు. గోడౌన్లు అందుబాటులో లేకపోతే కొనుగోలు పాయింట్ పెట్టి కొనాలన్నారు. కొన్న పొగాకును దగ్గర వున్న గోదాములకు తరలిస్తే రవాణా ఖర్చులు కొద్దిగైనా తగ్గుతాయన్నారు. త్వరగా పొగాకును కొనవచ్చున్నారు.

మురికిపూడి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి నాగేశ్వర రావు రైతు మాట్లాడుతూ కొనుగోలు ఆలస్యమయ్యేకొద్దీ నాణ్యమైన పొగాకు ప్రతి క్వింటాకు 25 నుంచి 30 కిలోల రంగు మారడమే కాకుండా 10 నుంచి 15 కిలోల బరువు తగ్గుతుందన్నారు. రంగు మారిన పొగాకు పనికి రాదనీ, ఒక వేళ పనికి వచ్చినా రేటు ఎక్కువగా రాదన్నారు.

అదే గ్రామానికి చెందిన మరో రైతు తమ్మి శెట్టి శ్రీరామూర్తి మాట్లాడుతూ గతంలో కంపెనీలు పొగాకు కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే వారని ప్రస్తుతం 10 రోజులు పడుతోందన్నారు. ఈ పది రోజుల్లో ఏ నిమిషం ఏమౌతుందోనని మానసికంగా ఆందోళనకు గురౌతున్నామని తెలిపారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న ప్రభుత్వాలు

- 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి
- భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం పిలుపు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కార్మికుల పోరాడి సాధించుకున్న బ్రిటిష్ కాలం నాటి చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని పల్నాడు భావన ఇతర నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పుతుంబాక భవన్లో జరిగిన పల్నాడు జిల్లా భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షతన ఏర్పాటు చేసిన విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసం గించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించి యజమానులకు లాభాలు సమకూర్చే అనుకూల చట్టాలను తీసుకు వచ్చి కార్మికులకు తీరని ద్రోహం చేసిందని అన్నారు. ఈ విధానాలను తిప్పి కొట్టేందుకు జూలై 9న కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. గత వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. అత్యధిక కాలం ఇసుక సరఫరాను నిలిపివేసిందని, కరోన కష్ట కాలంలో పనులు లేక కుటుంబాలు గడవక ఆత్మహత్య చేసుకున్న సందర్భాలలో కార్మికులను ఆదుకోలేదని తెలిపారు. కార్మికులు కూడబెట్టుకున్న సెస్ డబ్బులు వేల కోట్ల రూపాయలు ఇతర మార్గాలకు మళ్ళించిందని అన్నారు. సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్ళించి సంక్షేమ బోర్డును నిలిపివేసిందని అన్నారు. ఈ నేపథ్యంలో అప్పటి ప్రతిపక్షంలో ఉన్న టిడిపి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని కానీ అధికారంలోకి వచ్చే సంవత్సరం అయినా కార్మికుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. ఇప్పటివరకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించలేదని, పెండింగ్ బకాయిలు చెల్లించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 8 గంటల పని విధానానికే కార్మికులు అలసిపోతోంటే ముఖ్యమంత్రి చంద్రబాబు 12 గంటల పని విధానాన్ని తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, కేంద్ర కార్మిక సంఘాలు జూలై 9న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భవనిర్మాణ కార్మికులంతా పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై తమ నిరసనను తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బత్తుల ఏడుకొండలు, కోట ఆంజ నేయులు, షేక్ సైదులు, సురేష్, రామిశెట్టి ఆంజనేయులు, యేసు, అంగలకుదురు ఆంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిలార్ మసూద్

మద్యం దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-ఈపూరు

ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈపూరు సర్కిల్ పరిధిలోని బొల్లాపల్లి, ఈపూరు, రొంపిచర్ల మండలాలోని మద్యం దుకాణాలలో ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు సీఐ డీ.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కల్తీ మద్యం, నకిలీ మద్యం, నాటు సారాయి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నాటు సారాయి అనుమానిత ప్రాంతాలలో సాధారణ తనిఖీలతో పాటు ఆకస్మిక తనిఖీలు చేపట్టి నియంత్రణకు చర్యలు చేపడు తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యపానం సేవిం చే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ నిర్ణయం - రైతులకు అన్యాయం

ప్రజాశక్తి - తాడేపల్లి

రాష్ట్రంలోని కూటం ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి మరో 44 వేల ఎకరాలు తీసుకోవాలని నిర్ణయించుకోవటం గతంలో రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం చేయడమేనని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఉండవల్లి సెంటర్ ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం రాజధాని రైతు సంఘం డివిజన్ కమిటీ విస్తృత సమావేశం కె.ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ రాజధాని అమరావతిలో మరో 44 వేల ఎకరాల భూములు సమీకరించాలని ప్రభుత్వ నిర్ణయం గతంలో రాజధానికి 29 గ్రామాలలో 33,000 ఎకరాల భూ సమీకరణకు ఇచ్చిన రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంద నీ చెప్పారు. ప్రభుత్వం తలపెట్టిన రెండవ విడత భూ సమీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 44 వేల ఎకరాల భూ సమీకరణ నిర్ణయంతో రాజధాని గ్రామాల్లో భూముల క్రయ విక్రయాలు మందగించేయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వము అధికారంలోకి వస్తే రాజధాని అమరావతికి మళ్లీ పూర్వ



సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

వస్తుందని తమ భూములు ధరలు పెరుగుతాయని భావించిన రైతులకు నిరాశ మిగిలింది అని చెప్పారు. గతంలో భూములు ఇచ్చిన రైతుల ప్లాట్లలో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు నవ నగరాల నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల కౌలు నగదును వెంటనే రైతు ఖాతాలలో జమ చేయాల నీ కోరారు. ఉచిత విద్య వైద్యం తదితర హామీలు నెరవేర్చాలన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. రాజధానిలో ఉన్న యూనివర్సిటీలలో స్థానిక విద్యార్థులకు ఫీజు రైతులు ఇవ్వాలని, అప్పుడే భూములు ఇచ్చిన రైతులకు, మరి బిడ్డలకు కొంతమేర అవకాశాలు కల్పించిన వారు అవుతారని చెప్పారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ 20 వేల రూపాయలను రైతు ఖాతాలలో జమ చేయాలన్నారు. పంటల భీమా కింద ఇన్స్సూరెన్స్ పాలసీని ప్రభుత్వమే కట్టాలన్నారు. పంటలకు మద్దతు ధర, స్మార్ట్ మీటర్లు ఎత్తివేత, విద్యుత్తు సంస్కరణలు ఎత్తివేత, నాలుగు లేబర్‌ల కోడ్‌ల రద్దు చేయాలని, 10 గంటల పని దినాలు చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, ఉపాధి హామీ నిధులు పెంచాలని,కౌలు రైతులకు

మరో 44 వేల ఎకరాలు తీసుకోవద్దు : రైతుసంఘం

భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలని, తదితర డిమాండ్స్ తో జులై 9న జరుగు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు నాయకులు ఎం.రవి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు అష్ట కష్టాలు పడ్డ రైతులు ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దని ప్రభుత్వాన్ని కోరారు.విస్తరణ పేరుతో కొత్త గ్రామాల్లో ప్రజలను బలవంతంగా ఒప్పించడం సరికాదన్నారు. రాజధాని రైతు సంఘం అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రెండో విడత భూ సమీకరణ ఆపాలని, రైతులకు కౌలు డబ్బులు వెంటనే చెల్లించాలని, ప్లాట్లను అభివఅద్ధిపరిచి ఇవ్వాలని, ఉండవల్లిలో యువన్ జోన్ గ్రీన్ జోన్ ఎత్తివేయాలని కోరారు. ఈ సమావేశంలో రాజధాని రైతు సంఘం కార్యదర్శి వై.శ్రీనివాసరావు, గణేష్, నాగేశ్వరరావు, వీర్ల వెంకయ్య, వీరస్వామి, బక్కిరెడ్డి, దండమూడి సాంబశివరావు, కోటేశ్వరరావు, ఈ రామారావు, తాడేపల్లి మండల అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ రెడ్డి, ఎస్.కె.ఎర్రపీరా తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ఏడాదిగా కొబ్బరి నూనె, సబ్బులు ఇవ్వలేదు..

ప్రజాశక్తి - తాడేపల్లి

మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్‌లో భాగమైన తాడేపల్లి పట్టణంలోని పరిశుధ్య కార్మికులకు 12 నెలలకు పైగా కొబ్బరి నూనె, సబ్బులు ఇవ్వకుండా అధికారులు తాత్సర్యం చేయటం సిగ్గుచేటని సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, బోరుగ వెంకటేశ్వర్లు ప్రభుత్వ అధికారుల తీరును ఎండగట్టారు. ఆదివారం ఉదయం 6 గంటలకు నులకపేటలోని మచ్చలు పాయింట్ వద్ద మున్సిపల్ పారిశుద్ధ కార్మికుల గ్రూపు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరగబోయే సార్వత్రిక సమ్మెలో పారిశుద్ధ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికులకు గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలు అన్నింటికీ జీవోలు ఇచ్చి అమలు చేయాల్సిన బాధ్యత నేటి కూటం ప్రభుత్వంపై ఉందని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు అనేక సమస్యలు సృష్టించే దుర్మార్గమైన చట్టం తీసుకొచ్చిందని విమర్శించారు. పనిగంటలు పెంచటం చాలా అన్యాయమని ధ్వజమెత్త రు. కేంద్రం తీసుకొచ్చిన చట్టాలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలు జరుపుతుందని విమర్శించారు. సమావేశంలో ఈ సంతోషం, రాంబాబు, నాగేశ్వరరావు, సువార్త, బాలయ్య, అనూష, శాంత, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు కె.బి.ప్రసాద్

విద్యుత్ మీటర్ల మార్పిడిని సహించం : సిపిఎం

ప్రజాశక్తి - తెనాలిరూరల్

ప్రజల ఇష్టా అయిష్టాలతో పనిలేకుండా మీటర్ల మార్పిడికి సిద్ధమవుతున్న ప్రభుత్వ విధానాలపై సిపిఎం నాయకులు మండిపడ్డారు. మీటర్లు మార్చద్దంటూ ఇంటింటా ఆదివారం శాంతినగర్‌లో ప్రచారం నిర్వహించారు. మీటర్లు మార్చటానికి వచ్చే వారు అదాని కంపెనీకి చెందిన కాంట్రాక్ట్ కార్మికులు కార్మికులే అన్నారు. ఆధాని కంపెనీ వద్ద విరాళాలు సేకరించిన రాజకీయ నాయకులు ఒకప్పుడు స్మార్ట్ మీటర్లు పగలుగొట్టాలని చెప్పడాన్ని విస్మరించి వారే మీటర్లు మార్చాలని అనుమతులు ఇవ్వడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ హుస్సేన్ వలి, కె.రవికుమార్, కొల్లిపర బాబు ప్రసాద్ పాల్గొన్నారు.

ఇటికాల వజ్రమ్మకు సిపిఎం నివాళులు





వజ్రమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

సిపిఎం శాఖ సభ్యులు ఇటికాల కాటమరాజు భార్య, మహిళా సంఘం నాయకురాలు ఇటికాల వజ్రమ్మ (68) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. వజ్రమ్మకు భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వజ్రమ్మ భౌతికాయంపై సిపిఎం పట్టణ కార్యదర్శి వి.వి.జవహర్ లాల్. జిల్లా నాయకులు ఎస్.ఎస్. చెంగయ్య, సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలాజీ, పట్టణ నాయకులు ఎం.చలపతి రావు, జి.వెంకయ్య, కె.నాగేశ్వరావు పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సిపిఎం నేతల నివాళి

వజ్రమ్మ భౌతికకాయంపై సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు, ఎం.రవి, ఈమని అప్పారావు పూలమాలవేసి నివాళులర్పించారు. రామారావు మాట్లాడుతూ వజ్రమ్మ సిపిఎం సీనియర్ నాయకులు కాటమరాజు పార్టీలో పని చేయడానికి అన్ని విధాల సహకరించిందని అన్నారు. 30 సంవత్సరాల పాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులుగా పనిచేస్తున్నారని అన్నారు. వజ్రమ్మ కుమారుడు ఖమ్మం జిల్లాలో సిపిఎంలో పనిచేస్తున్నారని అన్నారు. నివాళులర్పించిన వారిలో స్థానిక సిపిఎం నాయకులు ఎం.చలపతిరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ పట్టణ కార్యదర్శి వి.వెంకటేశ్వరావు ఉన్నారు.



పొగాకు రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పొగాకు కొనుగోలు కేంద్రాల కోసం నేడు నిరసన : రైతు సంఘం

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు, కాకుమాను మండలాలలో పొగాకు కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టి, అనంతరం పెదనందిపాడు తహశీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు నల్లమోతు రాజేంద్రతో కలిసి ఆదివారం పలు గ్రామాలలో రైతులతో సమావేశాలు నిర్వహించారు. పెదనందిపాడు మండలంలోని నాగులపాడు, పెదనందిపాడు, వరగాని, అన్నపర్రు, కొప్పర్రు, అబ్బినేనిగుంటపాలెం, రాయపాడు, గోగులమూడి, కర్రపాడు, కాకుమాను మండలంలోని కొమ్మూరు, పెద్దివారిపాలెం గ్రామాల్లో పొగాకు రైతులను కలిసి మంగళవారం పెదనందిపాడు లో చేపట్టే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పెదనందిపాడు మండల రైతులను గుంటూరు చుట్టగుంట వద్దకు, కాకుమాను మండల రైతులను పెదకాకాని వద్ద ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల వద్దకు పొగాకును తీసుకురమ్మంటున్నారని, పొగాకు పండించిన చోట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకుండా, 50 కిలోమీటర్ల దూరంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. స్థానికంగా పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పోపూరి సుధీర్, శాఖమూరి రంగనాయకులు, మదమంచి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.









మంగళగిరిలో ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరం పాల్గొన్న వైద్యులు, ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్న ప్రజా ఆరోగ్య వేదిక సిబ్బంది

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

ప్రజాశక్తి - మంగళగిరి

ఉచిత వైద్య శిబిరాలను ఆరోగ్య పరిరక్షణకై ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ డి.ఎస్.రాజునాయుడు అన్నారు. ప్రజా ఆరోగ్య వేదిక మంగళగిరి రీజియన్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువులోని కళ్యాణ మండపంలో ప్రముఖ వైద్య నిపుణులు ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మనిషి ఆరోగ్యంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య వేదిక మంగళగిరి రీజియన్ ఆధ్వర్యంలో అనేక సంవత్సరాలుగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి పేద ప్రజలకు వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. పోరాటం చేసి మంగళగిరిలో 100 పడకల ఆసుపత్రిని సాధించుకున్నామన్నారు. వైద్య శిబిరంలో ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ డి.ఎస్.రాజునాయుడు బృందం ఆధ్వర్యంలో స్త్రీలకు ప్రత్యేకంగా క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయబడినవి. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ పి.గిరిజ, దంత వైద్యులు డాక్టర్ ఎం వంశీకృష్ణ, జనరల్ వ్యాధి నిపుణులు డాక్టర్ లక్ష్మీ ప్రియాంక, శర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ గీష్మ, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ పి.వంశీకృష్ణ, దంత వైద్య నిపుణులు డాక్టర్ వి.సింధూర, డాక్టర్ హేమంత్ మాకినేని, డాక్టర్ ఎం.హిమని, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పి.అనూష, తదితరులు పాల్గొని ఉచితంగా పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక కార్యదర్శి ఎ.జయరాజు, కన్వీనర్ వి.వి. ప్రసాద్, ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు డి.నాగమణి, ఎస్.బాలకృష్ణ, వి.వెంకటేశ్వరరావు, జె.వి. రాఘవులు, ఎస్.ఎస్.చెంగయ్య, ఎం.రవి, ఎం.చలపతి రావు, ఎం.బాలాజీ, ఎం.చంద్ర, ఐజాక్ న్యూటన్ పాల్గొన్నారు.



వైద్య పరీక్ష చేయించుకుంటున్న యాగంటి

ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

కృష్ణవేణి ఎస్వీఆర్ డిగ్రీ కళాశాల వారి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని టిడిపి సీనియర్ నాయకులు మాచర్ల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మాచర్ల పట్టణంలో స్థానిక ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని యాగంటి మల్లికార్జునరావు సందర్శించి వైద్య పరీక్షలు పరీక్ష చేయించుకున్నారు. వైద్య శిబిరంలో 150 మందికి పైగా తమ ఆరోగ స్థితిపై అవగాహన పెంచుకున్నారు. ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని కేరళ రాష్ట్రానికి చెందిన ప్రముఖ వైద్య కేంద్రమైన శ్రీధరీయం ఆయుర్వేదిక్ పంచకర్మ వారి వైద్యులు డాక్టర్ కృష్ణదాస్ వారి సిబ్బంది పాల్గొని, ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వారికి విలువైన సూచనలను సలహాలను అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యనమదల వెంకట్రామయ్య, డైరెక్టర్స్ సుబ్బారావు, శ్రీనివాసరావు న్యాయవాది మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



అచ్చంపేటలో వంగవీటి మోహనరంగ కాంస్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - అచ్చంపేట

అచ్చంపేటలో వంగవీటి రంగ కాంస్య విగ్రహ ఆవిష్కరణలో వంగవీటి రంగా తనయుడు వంగవీటి రాధా, స్థానిక ఎమ్మెల్యే భాష్యంప్రవీణ్, సత్తనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ వంగవీటి రంగా ఒకసారి ఎమ్మెల్యేగా ఉన్నా ప్రజల గుండెల్లో నిలిచి పోయారంటూ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. విజయవాడలో పేదల పక్షాన నిలబడి వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన వ్యక్తి రంగా అంటూ గుర్తు చేశారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జూలై 4వ తేదీన రంగ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకోవాలని అభి మానులకు పిలుపునిచ్చారు. సాయిబాబా దేవాలయం వద్ద నుండి రంగా అభిమానులు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కన్వీనర్ గాదె వెంకటేశ్వర్లు కాపు నాయకులు గంధం కోటేశ్వరరావు అచ్చంపేట గ్రామ సర్పంచ్ కంబాల వీరబాబు టిడిపి జనసేన అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని చేయూత ర్యాలీ ఆటోవర్కర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా కార్యదర్శి ఎం.హరిపోతురాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పుతంబాక భవన్లో జరిగిన యూత ట్రాలీ ఆటో వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి డివిజన్ కమిటీ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి కొత్తపల్లి చిన్నమల్లయ్య అధ్యక్షత వహించారు. హరిపోతురాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగాన్ని కుదేలు చేసే విధంగా చట్టాలు మార్చాయనీ, దీనివలన ఇప్పటికే సంక్షోభంలో ఉన్న రవాణా రంగం మరింత కష్టాల్లో కూరుకు పోయే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన భారత న్యాయ సంహిత 106/1, 106/2ల వలన డ్రైవర్లకి ప్రమాదకరమైన శిక్షలు, అధిక మొత్తంలో పెనాల్టీలు వేస్తారని తెలిపారు. ఇప్పటికే పాసింజర్ ఆటో రంగాన్ని ఓలా ఉబర్ వంటి కార్పొరేటర్ రంగాలకు అప్పగించిందనీ, దీనివలన ఆటో లక్షలాది మంది డ్రైవర్ల జీవితాలు రోడ్డున పడే అవకాశం ఉందని అన్నారు. రవాణా శాఖ అధికారుల కార్యాలయాలను ఎత్తివేసి ప్రైవేటు సంస్థల ద్వారా సెన్సార్ సిస్టం, ఆటోమేటిక్ మిషన్ ద్వారా వాహనాలను బ్రేక్ చేసే పద్ధతి వల్ల వాహనాల కాలయాపన అవటంతో పాటు రవాణా రంగ కార్మికులపైన ఆర్థిక భారం



సమావేశంలో మాట్లాడుతున్న హరిపోతురాజు

పెరుగుతోందని చెప్పారు. ట్రాన్స్‌పోర్టు రంగంలో కార్పొరేట్ శక్తులను తీసుకొచ్చేందుకు చేసే ప్రయత్నాలను కలిసి కట్టుగా తిప్పి కొట్టాలన్నారు. జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెలో రవాణా రంగంలోని కార్మికులం అందరం భాగస్వాములమై జయ ప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సెగ్గం అంజి, పోలయ్య వెంకట్, సైదేశ్వరరావు కాసియా, నాగేశ్వరరావు శ్రీనివాసరావు, రామకష్ణ రాజేంద్ర, సాంబశివరావు పాల్గొన్నారు.

యుద్ధాల వల్ల దేశాల ఆర్థిక వ్యవస్థకు దెబ్బ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సామ్రాజ్యవాద లక్షణాలతో యుద్ధ దాహంతో రగిలి పోతున్న అమెరికా తాజాగా ఇరాన్‌పై బల ప్రదర్శనకు దిగి అశాంతిని కలిగిస్తోందని వామపక్ష సీనియర్ నాయకులు బి.ఆంజనేయ రెడ్డి అన్నారు. రొంపిచర్ల మండలం అన్న వరం గ్రామంలో ఇరాన్‌పై అమెరికా దాడిని నిరసిస్తూ ఆదివారం ప్రజా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ యుద్ధం వల్ల ఆయా దేశ ప్రజలపై అనేక ప్రభావాలు పడతాయనీ, ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుందని అన్నారు. అమెరికా అండతో పాలస్తీనాలోని గాజాను ఇజ్రాయిల్ నేలమట్టం చేసి 60వేల మంది అమా యక ప్రజలను బలి తీసుకుందనీ, లక్షలాది మంది గాయాల పాలై కాపాడాలని ఆర్తనాదాలు చేస్తూ ఇతర దేశాలకు వలస పక్షుల్లా వెళ్లిపోతున్నారన్నారు. ఇదిలా ఉండగానే ఇరాన్‌పై ఇజ్రాయిల్ విరుచుకుపడి ఒక్కరోజులోనే 100 ప్రధాన లక్ష్యాలపై దాడి జరిపి ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసిందనీ, 12 రోజులకు పైగా భయంకరమైన దాడులకు పాల్పడ్డారని అన్నారు. మధ్యవర్తి పాత్ర





మటుమాయమై నేరుగా అమెరికా రంగంలోకి దిగడం ఇజ్రాయిల్‌ను ముందు పెట్టి అమెరికా సామ్రాజ్య వాదులు, వారి మద్దతు దారులు జరిపిన ఘోరమైన యుద్ధమన్నారు. యుద్ధ దాహంతో రగిలి పోతున్న అమెరికాకు భారతదేశం ఎటువంటి మినహా యింపు కాదనీ, అమెరికా యుద్ధోన్మాదాన్ని ప్రతి ఒక్కరు తీవ్రంగా ఖండించాలని తెలిపారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు రైతులకు, పేద ప్రజలకు ఆత్మహత్యలను ప్రసాదిస్తున్నాయన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాక మద్దతు ధర కోసం రైతాంగం అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వాలలో చలనం లేదన్నారు. అమాయక ప్రజలను మోసం చేసి కోట్లాది రూపాయలు దండుకున్న వారికి పోలీసులు, రాజకీయ నాయకులు అండగా ఉంటున్నారని తెలిపారు. వ్యవసాయం కోసం వేల రూపాయలు అప్పులు చేసిన వారిని బ్యాంకర్లు, ఫైనాన్స్ వ్యాపారస్తులు వేధిం పులకు గురిచేసి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసి ఆత్మహత్య చేసు కునేలా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలపై రాయితీలు ఎత్తివేయడంతో ధరలు విపరీతంగా పెరిగి ధరలు తగ్గిపోతుతుండడంతో రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర పోరాటం తర్వాత జరిగిన అతి పెద్ద రైతాంగ పోరాటం పోలీసులు ఎన్ని నిర్బంధాలు విధించినా విజయవంతమైందన్నారు. ప్రజలు ఐక్యంగా ఉండి పోరాటాలు చేసి ప్రభుత్వాల మెడలు వంచి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఫైనాన్స్ పెట్టుబడి దారుల వేధింపులు ఎదుర్కొంటున్న అమాయక ప్రజలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై రైతులు గ్రామ స్థాయిలో చర్చించి చైతన్యం నింపుకోవాలని వారి హక్కులను కాపాడుకోవాలన్నారు. సదస్సులో అన్నవరం పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారంతో ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-ముప్పాళ్ళ

మండల కేంద్రంలోని ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు తాడువాయి శివనాగరాజా, పోలిశెట్టి శివప్రసాద్, కోంజేటి సాయిజగన్నాధరావు సహకారంతో తేజ నర్సింగ్ హెూమ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో నర్సారావుపేట తేజ నర్సింగ్ హెూమ్ కీళ్ల వైద్యనిపుణులు డాక్టర్ బొట్ల రఘు ప్రసాద్, జనరల్ మెడిసిన్ వైద్యనిపుణులు బొట్ల రంగతేజ, ప్రసూతి వైద్యనిపుణులు కర్నాటి శ్రావణి, కంటి వైద్య నిపు ణులు డాక్టర్ దండమూడి వెంకటేశ్వరరావు పాల్గొన్ని వైద్య సేవలు అందజేశారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ వ్యాధులు వచ్చినప్పుడు ఆర్థిక పరిస్థితి బాగాలేక చాలా మంది వైద్యానికి దూరంగా ఉండి ఎంతో ఇబ్బందులు పడు తున్నారన్నారు. ఇలాంటి వైద్యశిబిరాలు వారికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలు గ్రామీణ ప్రాంతా ల్లో జరిగే ఇలాంటి వైద్యశిబిరాలను సద్వినియోగం చేసు కోవాలన్నారు. శిబిరంలో



210మందికి వైద్యసేవలు నిర్వ హించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పెద్దలు మారూరి రామలింగారెడ్డి, షేక్ అబ్దుల్ మజీద్, అన్నదాసు సురేష్, సయ్యద్ అన్వర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో విఆర్‌ఒ రాజారావు మృతి



ప్రజాశక్తి -దుర్గి

నియోజకవర్గ కేంద్రమైన మాచర్లలో వీఆర్వోగా చేస్తున్న రాజారావు(62) గుండెపోటుతో మఋతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్ర మైన దుర్గి గ్రామానికి చెందిన అందుగుల రాజారావు మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్-3లో వీఆర్వోగా పనిచేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో విధుల్లో ఉండగా గుండె పోటు వచ్చి అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు వైద్యశాలకు తీసుకొనిలోపే మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. గతంలో ఈ విధంగానే గుండెపోటు వచ్చిందని అయితే వెంటనే చికిత్స చేయడంతో అప్పుడు బాగానే ఉన్నారని బంధువులు తెలియజేశారు. రాజారావు అడిగొప్పల, గోలి, కంచరగుంట, ప్రస్తుతం మాచర్లలో విఆర్ఓగా బాధ్యతలు నిర్వహించారు. ఆయనకు భార్య, నలుగురు సంతానం ఉన్నారు. ఆయన మృతి చెందిన విషయం తెలు సుకున్న పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు ఆయన పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుం బానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ క్రిస్టీనా

ప్రతిభా పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన బాబు జగజ్జీవన్ రామ్ (బిజెఆర్) కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం పురస్కారాలను అందించారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో కమిటీ అధ్యక్షులు మేకల సురేష్ అధ్యక్షతన జరిగిన పురస్కార ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర జిఎస్టి ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్ కుమార్, విశిష్ట అతిథిగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించేందుకు బిజెఆర్ కమిటీ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతిలో 525 మార్కులకు పైబడి సాధించి, పురస్కారానికి ఎంపికైన విద్యార్థులను వారు అభినందించారు. జిల్లాలో 35 మండలాల నుంచి ఎంపికైన మాదిగ సామాజిక వర్గానికి చెందిన 120 మందికి ఒక్కొక్కరికి రూ.5 వేల నగదు, బ్యాగ్, వాటర్ బాటిల్, పొన్నెకంటి సత్యవేదాంతాచారి జ్ఞాపకార్థం ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి దోనేపూడి విజయ్ బాబు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి దోనేపూడి మధు బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, 32వ వార్డు కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి, కమిటీ గౌరవా ధ్యక్షులు అత్తోట శరత్ బాబు, సెక్రటరీ సద్గుణరావు, ట్రెజరర్ సిద్దెల కమలాకర్, నలుకుర్తి రమేష్, అత్తోట శ్యామ్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు

కల్లుగీత కులాల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - గుంటూరు

కల్లుగీత కులాల ప్రజల విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి గౌడ మహాజన సంఘం ఏర్పాటు ద్వారా కృషి చేస్తామని సంఘ నాయకులు ఈడె అశోక్‌కుమార్‌గౌడ్ అన్నారు. స్థానిక నెహ్రూ నగర్‌లో సంఘం రాష్ట్ర సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గీత కులాల అభివృద్ధికి గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత పేర్లతో ఉన్న ఐదు గీత కులాలను ఏకతాటిపైకి తెచ్చి భవిష్యత్‌లో తగిన కార్యాచరణతో ముందుకు వెళతామన్నారు. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ సంఘ నిర్మాణం కోసం ఈ సమాశంలో తీర్మానాలు చేసినట్లు చెప్పారు. సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన నాయకులు చాలపాటి వెంకటేశ్వరరావు, తులసిరామ్, డి.కుమారస్వామి, ఎల్.అప్పారావు, శ్రీసైన, జి.బాబ్జి, గోపాల్ ఈడిగ, పట్టా రాంబాబు, రావుల మని, కె.వంశీ, మహిళా నాయకురాలు శ్రీహరిరాణి తదితరులు పాల్గొన్నారు.

రాజధాని కోసం భూములిచ్చిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలి..

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతులను అన్ని విధా ఆదుకోవాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్లు తోపాటు వసతులు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి పేరును పార్లమెంటులో చర్చించి గెజిట్ నోటిఫికేషన్ ప్రకటించి రాష్ట్రపతి చేత ఆమోదింప చేయాలని జలీల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జలీల్ విజ్ఞప్తి చేశారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - తెనాలి

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11:30 గంటలకు కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక తెలిపారు. పట్టణ అభివృద్ధికి సంబంధించి పొందుపరిచిన ఎజెండా అంశాలపై చర్చించేందుకు సభ్యులు విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో భాగంగా తాడేపల్లి లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు చట్ట ప్రకారం ఇవ్వవలసిన క్యాజువల్ లీవులు, వీక్లీ ఆఫ్‌లు ఇవ్వకుండా చట్ట విరుద్ధంగా అధికారులు పనిచేయటం సరైన పద్ధతి కాదని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కృష్ణనగర్‌లో జరిగినవాటర్ వర్క్స్ కార్మికుల గ్రూపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దుర్గారావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా చట్ట విరుద్ధంగా వ్యవహరించటం సరైనది కాదని విమర్శించారు. నెలకు 30 రోజులు వారి చేత గొడ్డు చాకిరీ చేయించు కోవటం మీకు తగునా అని ప్రశ్నించారు. జీతం కూడా 13000 రూపాయలు అని ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లి నుండి కుంచనపల్లి, గుండి మేడ, ప్రాతూరు, మెల్లెంపూడి, చిర్రావూరి, వరకు ఇక్కడ నుండి కార్మికులు తమ సొంత ఖర్చులతోటి రాకపోకలు సాగించాల్సి వస్తుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అంత దూరం వెళ్లి అక్కడ వాటర్ వర్క్స్ పనులను చేసి రావటం వలన అదనంగా జేబులో డబ్బులు వారికి ఖర్చు అవుతున్నాయని కార్మిక వర్గం



మాట్లాడుతున్న సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు

వాపుతుందని చెప్పారు. కార్మికుల చేత ఇటువంటి చాకిరి చేయించుకోవడం సరైన పద్ధతి కాదని ఎనిమిది గంటల పని పద్ధతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.మంగళగిరిలో ఒక పద్ధతి తాడేపల్లిలో మరొక పద్ధతి అవలంబించడం కార్పొరేషన్ అధికారులకు న్యాయం కాదని దుర్గారావు ధ్వజమెత్తారు. వెంటనే కార్పొరేషన్ పరిధిలోని ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేకపోతే కార్మికులను కూడగట్టి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, మురళి రాజు, నరసింహారావు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

యువ వైద్యురాలు వాణిశ్రీలక్ష్మీకి పలువురి అభినందనలు



వాణిశ్రీ లక్ష్మీకి అభినందనలు తెలియజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

పాత మంగళగిరి భద్రావతి నగర్లో ఉజ్బెకిస్తాన్ దేశంలో బుఖారా యూనివర్సిటీ నుండి ఎంబీబీఎస్ స్పెషాలిటీ జనరల్ మెడిసిన్ పూర్తి చేసుకుని ఇటీవల స్వస్థలం చేరుకున్న పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ వూట్ల వాణిశ్రీ లక్ష్మీని ఆదివారం పలువురు పద్మశాలియ ప్రముఖులు, టీడీపీ బీసీ నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణిశ్రీ లక్ష్మిని జన్మదినోత్సవం కూడా కావడంతో వారు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలను అందజేశారు. డాక్టర్ వాణిశ్రీ లక్ష్మిని తండ్రి వూట్ల వెంకట సాంబశివరావు స్థానికంగా పద్మశాలియ సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ చేనేత వస్త్ర వ్యాపారంలో మంచి గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా టీడీపీ గుంటూరు పార్లమెంటు పద్మశాలియ సాధికారిక సభ్యులు జొన్నాదుల బాలకృష్ణ మాట్లాడారు. డాక్టర్ వాణిశ్రీ లక్ష్మీ విదేశాలలో వైద్య విద్య పూర్తి చేసుకోవడం పద్మశాలీలకు గర్వంగా ఉందన్నారు. అభినందనలు తెలిపిన వారిలో టీడీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు, ఉపాధ్యక్షులు రుద్రు మురళీకృష్ణ, టీడీపీ నాయకులు గోవాడ దుర్గారావు, సింహాద్రి రామారావు, దామర్ల మోహన్ ఉన్నారు.

ఇంటింటికీ తాగునీటి సరఫరా కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రతి ఒక్క ఇంటికి మంచినీటి సరఫరా అందించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పొన్నూరు ఎమ్మెల్యేల ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం నంబూరు గ్రామంలో జల్ జీవన్ మిషన్ గ్రాంట్ ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికి నీటిని అందించే విధంగా నేడు వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంది అన్నారు. తల్లికి వందనం పథకం ప్రకటించిన విధంగానే తల్లికి ఎంత మంది చదువుకునే విద్యార్థులు ఉంటే అంతమందికి వర్తింపజేసిన ఘనత



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర

కూటమి ప్రభుత్వ నిదే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, మాకిరెడ్డి జయరామిరెడ్డి మహమ్మద్ మోసిన్ కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

పిబిఎన్ కళాశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - పొన్నూరు

పిబిఎన్ కళాశాలలో 1979- 82 బికాం చదువు కున్న పూర్వ విద్యార్థుల ద్వితీయ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పొన్నూరు మండల పరిధిలోని వల్లభరావుపాలం గ్రామంలో మదమంచి సుబ్బారావు ఇంటి వద్ద ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గన్న పూర్వ విద్యార్థులు తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సుమారు 43 ఏళ్ల తర్వాత గత సంవత్సరం ప్రారంభమైన ఈ సమ్మేళనం కొనసాగింపుగా ఈ ఆదివారం అందరూ కలిసి ఉత్సాహంగా ఉల్లాసంగా సరదాగా ఒకరికొకరు వారి ఈ 40 ఏళ్ల ప్రస్థానంలో వారు సాధించిన పురోగతి పంచుకోవడంతో పాటు చదువుకున్న సమయంలో వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇదే విధంగా అందరూ ఒకరికొకరు సహకరించుకోవటంతో పాటు సమాజసేవకు తమ వంతు కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ విధంగా కలుసుకోవటం ఎంతో ఆనందాన్ని కలిగించిందని దీన్ని కొనసాగించు కుందామని నిర్ణయించు కున్నారు. ఈ సందర్భంగా



సుబ్బారావు దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వల్లభరావు పాలెంకి చెందిన మదమంచి సుబ్బారావు దంపతులు 108 పుణ్యక్షేత్రాలను సందర్శించిన సందర్భంగా దంపతులను పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిబిఎన్ కళాశాల 1979-82 బికాం పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు కొసనం రామ్మోహన్ రావు, కార్యదర్శి కోళ్ళపూడి కిషోర్, ట్రెజరర్ వై శివరామకృష్ణ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

208వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారము నాటికి 208వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలలో నారదాసు సుబ్బారావు, వై సాంబశివరావు, బి.నాగేశ్వరావు, బి.నవనీతం, ముసలా సాంబశివరావు కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేములదుర్గారావు మాట్లాడుతూ కార్మికులకు న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్మికులు షేక్ సుభాని, బి.సూర్యప్రకాశరావు, షేక్ ఇస్మాయిల్, బాషా, ఆరిఫ్, డి.మాణిక్యరావు, ఎం.గురవయ్య, తుపాకుల నాగేశ్వరావు, ఎం.ఆశీర్వాదం, బి.దీనయ్య, మహిళలు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న టిడిపి నాయకులు

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం టిడిపి నాయకులు బాధితుల ఇంటికి వెళ్లి అందజేశారు. మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలో గోలి చైతన్యకి రూ.45,000 వేల చెక్కును, మాదాల నవదీప్‌కి రూ.65,800 విలువైన చెక్కును, రామినేని ప్రేమలత రూ,42,292 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను, మొత్తం ముగ్గురికికి 1,53,092 విలువైన చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమం లో మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్,రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్ధసారథి, మంగళగిరి రూరల్ మండల అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, రైతు నాయకులు గాదె పిచ్చిరెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్, గుడిమెట్ల మరియదాస్, కొడవలి ఆనంద్, మొద్దుకూరి రమేష్ బాబు, కంచర్ల బద్రి, షేక్ బాజీ వలి, కంచర్ల బుల్లబ్బాయి, బర్రా శ్రీకాంత్, వెలగపూడి బ్రహ్మం,షేక్ బాజీ (నేపాల్), కొప్పాక ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ శారద

డి3 సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బుర్రిపాలెం రోడ్డులో డాక్టర్ ఎస్ భవనంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 300 మంది రోగులకు వైద్యం అందించినట్లు డాక్టర్ డి.శారద తెలిపారు. వచ్చిన రోగులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆరోగ్య సూత్రాలను వివరించినట్లు చెప్పారు. షుగర్ వ్యాధిగ్రస్తులు కాళ్లకు పుండ్లు పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. మందులు లేకుండా వ్యాధిని తగ్గించడమే సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. రోగులకు థైరాయిడ్ ఈసీసీ రక్తపోటు పరీక్షలు ఉచితంగా నిర్వహించి నెలకి సరిపడా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి నెల నాలుగవ ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగపరచుకోవాలని పట్టణ ప్రజలను కోరారు.



జెసిబితో మట్టి తవ్వి పొలం

అనధికార మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - తెనాలి

అనుమతులు లేకుండా అడ్డగోలుగా మట్టితవ్వకాలు మొదలయ్యాయి. రూరల్ గ్రామం కొలకలూరు లో శనివారం రాత్రి గుడివాడ పంచాయతీ పరిధిలోని పొలంలో గ్రామానికి చెందిన జి.ప్రేమ్‌సాగర్ జెసిబి సాయంతో మట్టి తవ్వి, ట్రాక్టర్ల ద్వారా బయటికి తరలించారు. ఆ సమయంలో కొందరు గ్రామస్తులు గమనించి అనధికార తవ్వకాలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గుడివాడ విఆర్‌ఓ భాను రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. మట్టి తవ్వకానికి పాల్పడిన వ్యక్తిపై, తరలింపుకు ఉపయోగించిన జెసిబి, ట్రాక్టర్ నంబర్లతో సహా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.



హాజరైన ప్రతినిధులు

ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత మహాసభలో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రతినిధులు

ప్రజాశక్తి - గుంటూరు

కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఈనెల 27 నుండి 30వ తేదీ వరకూ జరుగుతున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) 18వ అఖిల భారత మహాసభలలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి 8 మంది ప్రతినిధులు రాష్ట్రం తరపున పాల్గన్నారు. దేశం నలుమూలల నుండి అన్ని రాష్ట్రాల నుండి మహాసభకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు హాజరయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్.సమీర్, ఎం.కిరణ్, పల్నాడు జిల్లా కన్వీనర్ కోట సాయి, జిల్లా సహాయ కార్యదర్శులు నవిత, యశ్వంత్, పల్నాడు జిల్లా గరల్స్ కన్వీనర్ అమూల్య, సౌమ్య, బాపట్ల నుండి భాను హాజరయ్యారు.

జాతీయస్థాయి సమావేశాలకు మాచర్ల మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్

ప్రజాశక్తి - మాచర్ల



మాచర్ల మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్

హర్యానాలోని గురు గ్రామ్‌లో భారత పార్లమెంటు హర్యానా ప్రభుత్వ సహకారంతో.. జులై 3, 4 తేదీల్లో దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పట్టణ స్థానిక సంస్థల చైర్మన్‌లకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర అంశాలపై అవగాహన కల్పించడం కోసం రెండు రోజులు జాతీయ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు ఆంధ్రప్రదేశ్ నుంచి పలువురు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లను నామినేట్ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. నామినేట్ చేసిన వారిలో మాచర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మదార్‌సాహెబ్‌ను ఉన్నారు. ఈ సందర్భంగా మదార్‌సాహెబ్ మాట్లాడుతూ ఇది మంచి అవకాశమని, తప్పకుండా జాతీయ సమావేశాలకు హాజరవుతానని, తనను ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మిక హక్కుల పరిరక్షణ కోసం సమ్మె : సిఐటియు

ప్రజాశక్తి- తాడేపల్లి

కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ నాయకులు వై.నేతాజీ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం ప్రకాష్ నగర్‌లోని సిఐటియు కార్యాలయం వద్ద జరిగిన వివిధ రంగాల కార్మికుల విస్తృత సమావేశం జరిగింది. సమావేశానికి సిఐటియు తాడేపల్లి పట్టణ నాయకులు కోట బాబురావు అధ్యక్షత వహించారు. నేతాజీ మాట్లాడుతూ దేశంలో ఉవ్వెత్తున సాగిన కార్మిక వర్గ పోరాటాల ఫలితంగా 1926లో ట్రేడ్ యూనియన్ చట్టం వచ్చిందని వివరించారు. కార్మిక వర్గం రక్తతర్పణం చేసి 44 కార్మిక చట్టాలు పోరాడి సాధించుకున్నారని గుర్తు చేశారు. అరెస్టులు, కేసులకు వెరవక సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. 8 గంటల పని విధానం కోసం 1885 నుండి 1917 వరకు పోరాటం ఫలితంగా మొట్టమొదట సోవియట్ రష్యాలో 8 గంటల పని విధానం అమల్లోకి వచ్చిన సంగతిని వివరించారు. వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి పెట్టుబడిదారులకు మరిన్ని రాయితీలు కల్పించిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వం బిజెపి తీసుకొచ్చిన దుర్మార్గమైన చట్టాలకు మద్దతు తెలపటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో మహిళలకు భద్రత కల్పిస్తామని చెప్పటం బూటకంగా తేల్చి పారేశారు. పని ప్రదేశంలో కనీసం కమిటీ లేకుండా తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలని కార్మిక వర్గం అడిగే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెబుతుందా అని నిలదీశారు. 29 సంక్షేమ చట్టాలను రద్దుచేసి కార్మిక వర్గం ఉసురు తీసారని విమర్శించారు. ఒకరోజు సమ్మె చేస్తే ఎనిమిది రోజులు జీతం తగ్గింపు లాంటి చర్యలను పాలకవర్గ పార్టీలు సమర్ధిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 15 సంవత్సరాల నుండి ఇబ్బడి ముబ్బడిగా ధరల పెంచిన ప్రభుత్వాలు ఐదేళ్లకోసారి కార్మికులకు జీతాలు పెంచాలని చట్టం ఉన్న ఎందుకు అమలు జరపటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిరక్షణ కోసం, ప్రైవేట్‌లో రిజర్వేషన్ల కోసం ఈ నెల 9వ తేదీన జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అదే రోజు ఉదయం 9 గంటలకు సాయిబాబా గుడి వద్ద నుండి కార్మిక ప్రదర్శన ఉంటుందని, అన్ని రంగాల కార్మికులు ఉదయం అక్కడికి చేరుకోవాలని కోరారు. సమావేశంలో సిఐటియు రూరల్ నాయకులు పల్లె కృష్ణ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కమిటీ నాయకులు వై.నేతాజీ

మా గ్రామాలకు రోడ్లు వేయండి మహాప్రభో...

- తంగెళ్లమూడి, అనమర్లపుడి గ్రామస్తుల వేడుకోలు
- గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు
- గర్భిణులు వృద్ధులు ఆసుపత్రులకు చేరుకోలేక తీవ్ర అవస్థలు





పూర్తిగా పాడైపోయి నీరు నిలిచిన రహదారులు

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని తంగెళ్ళమూడి, ఆనమర్లపూడి గ్రామాలకు రవాణా మార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. అధికారులకు ప్రజాప్రతినిధులకు చెప్పిన తమ కష్టాలు తీరడం లేదని వాపోతున్నారు.వర్షం పడితే గుంటల్లో నీరు నిలిచి అరాకొరగా ఉన్న రోడ్లు కూడా తమకు మఅత్యుపాసంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పూర్వం గుంటూరు నుంచి తమ గ్రామాలకు బస్సు సర్వీసులు నడిచేవని నేడు గ్రామాలకు ఆటోలు కూడా రాని దుస్థితి ఏర్పడింది అని గ్రామస్తులు తెలియజేశారు. ఇప్పుడిప్పుడే గ్రామాలలో మండల పరిషత్ గ్రాంట్లు ద్వారా కల్వర్టు పనులు చేస్తున్నప్పటికీ గ్రామాల ప్రజలు బయటికి వెళ్ళటానికి ప్రధాన మార్గాలైన అనమర్లపూడి నుండి కొలకలూరు, తంగెళ్లమూడి, హాఫ్‌పేట రోడ్లు, డొంకలు అధ్వానంగా ఉన్నాయన్నారు. తమ గ్రామాలలో పండ్ల తోటలు, నర్సరీలు ఉన్నప్పటికీ మార్కెట్‌కు తరలించడం పెద్ద సమస్యగా మారిందన్నారు. వర్షాలకు రోడ్లు చిత్తడై వాహనదారులు జారి పడిన సంఘటనలు అనేకమన్నారు. పెద్ద వర్షం పడితే గుంటూరు నుండి వచ్చే మురుగునీరు తమ పొలాలను ముంచి వేయడంతో పాటు గ్రామాలకు వెళ్లే రోడ్లను దెబ్బతీస్తుంది అని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి గ్రామంలో ఉన్న పాఠశాలకు వెళ్లే చిన్నారులు, ఆసుపత్రులకు వెళ్లే గర్భిణీలు, వృద్ధులు మరియు వ్యవసాయానికి వెళ్లే రైతులను దృష్టిలో ఉంచుకొని తక్షణమే రోడ్లు వేయాలని తంగెళ్లమూడి, అనమర్లపూడి గ్రామస్తులు కోరారు.

మెడికల్ కళాశాలకు పూర్వ వైభవం

- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తాం
- ప్రజాశక్తితో ప్రిన్సిపల్ ఎన్.వి.సుందరాచారి



గుంటూరు మెడికల్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, వైద్యులకు మెరుగైన వసతులు కల్పనకు కృషి చేస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.వి.సుందరాచారి తెలిపారు. ఈ కళాశాలలోనే చదివిన ఆయన కళాశాల ప్రిన్సిపల్‌గా గత ఏడాది అక్టోబరులో నియమితులయ్యారు. నవంబరు ఒకటిన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరించిన నాటి నుంచి ఇప్పటి వరకు కళాశాలకు పూర్వవైభవం కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపట్టారు. దాదాపు 10 ఏళ్లు పాటు ఎటువంటి అభివృద్ధి పనులు జరగకపోవడం వల్ల విద్యార్థులు, ప్రొఫెసర్లు, వైద్యులు ఇబ్బందులు పడ్డారు. ఈనేపథ్యంలో బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మౌలిక వసతులు కల్పనపై దృష్టిసారించిన సుందరాచారి ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు తెలియజేశారు.

పూర్వ విద్యార్థుల సహకారం?

గుంటూరు మెడికల్ కళాశాల పూర్వవిద్యార్థుల సహకారంతో పాటు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. వారు తాము చదువుకున్న కళాశాలకు సేవలు అందించడం ద్వారా తమ తల్లికి సేవలు అందిస్తున్నట్టుగా భావించారు. జూనియర్లు, సీనియర్ వైద్యులు తమ వంతు సహకారం అందించారు. ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా గుంటూరు మెడికల్ కళాశాల అల్యూమ్ని అసోసియేషన్ మద్దతుతో అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించాం. తనతోపాటు చదువుకున్న బ్యాచ్‌తోపాటు పూర్వ విద్యార్థులందరినీ సమీకరించాం.

కళాశాలలో చేపట్టిన పనులు?

కళాశాలలో క్యాంటిన్‌ను ఆధునీకరణ, ఓల్డ్ అనాటమి లెక్చర్ గ్యాలరీ, సిఎంఈ రీడింగ్ రూమ్, మెయిన్ కాలేజ్ గేట్, సెంట్రల్ లైబ్రరీ పైకప్పు మరమ్మతులు, ఫోరెన్సిక్ మెడిసిన్ సెమినార్ హాల్ ,రెండవ మెయిన్ గేట్ ను ఆధునీకరించాం. అదనంగా, ఫార్మకాలజీ పోస్ట్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్ లాబరేటరీని అప్‌గ్రేడ్ చేయడానికి రచనలు చేశారు. నాన్-రెసిడెంట్ పూర్వ విద్యార్థుల వైద్యులు నిర్దేశించిన ఉదాహరణతో ప్రేరణ పొందిన, చాలా మంది నివాస వైద్యులు-ఇప్పుడు గుంటూర్ మరియు చుట్టుపక్కల ప్రాక్టీస్ చేస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రులను స్థాపించారు- కూడా వారి అల్మా మేటర్‌కు మద్దతు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. అనేక విభాగాల పునరుద్ధరణతో పాటు, దాతల నుండి అవసరమైన సహకారంతో మౌలిక సదుపాయాలు, పరికరాల ఏర్పాటు చేశాం. కళాశాలలో భవనాలకు మరమ్మత్తులు చేసి ఆధునికత సంతరించుకునేలా తీర్చిదిద్దాం.

విద్యార్థులకు అందిన మౌలిక వసతులు?

రెండు కొత్త బస్సులు ఏర్పాటు చేశాం. డైనింగ్ టేబుల్స్, పరీక్ష పట్టికలు, కుర్చీలు, మైక్రోస్కోప్ (పాథాలజి), స్మార్ట్ బోర్డులు, కెమెరాలు, బాలుర హాస్టల్ కోసం క్రికెట్ ప్రాక్టీస్ నెట్స్, రెండు వాషింగ్ మెషీన్లు (1999 బ్యాచ్) కళాశాల రహదారుల పునరుద్ధరణ, ఆకుపచ్చ గడ్డి కార్పెట్, సెంట్రల్ లైబ్రరీ కోసం వాటర్ కూలర్లు లైబ్రరీ పుస్తకాలు, సెమీ ఆటో ఎనలైజర్, నాలుగు ఎయిర్ కండిషనర్లు, ఒక రిఫ్రిజిరేటర్, న్యూరోమస్కులర్ మానిటర్ (అనస్థీషియా), బాలికల హాస్టల్‌లో వాలీబాల్, షటిల్ కోర్టులు, శస్త్రచికిత్స విభాగం కోసం అదనపు ఎయిర్ కండీషనర్లు, లేడీస్ హాస్టల్ కోసం వాటర్ కూలర్స్,ఎక్స్-రే లాబీ, ఆర్‌వో ప్లాంట్లు, బయోకెమిస్ట్రీ విభాగానికి రిఫ్రిజిరేటర్ వంటి వసతులు కల్పించాం.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

